క్లుప్తంగా

చిరస్మరణీయుడు కన్నెగంటి హనుమంతు



నెహ్రూనగర్: బ్రిటిష్ ముష్కరుల తూటాలకు నేలకొరిగిన పల్నాటి బెబ్బులి, అమరవీరుడు కన్నెగంటి హనుమంతు చిరస్మరణీయులని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. ఆయన 101వ వర్ధంతిని పురస్కరించుకొని చుట్టుగుంటలోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గుంటూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. జిల్లా నుంచి ఎంతో మంది పోరాడి ప్రాణాల్ని సైతం త్యజించి, స్వాతంత్ర్యాన్ని సాధించారని తెలిపారు. వారి త్యాగాల్ని భావి తరాలు మరిచిపోకుండా గుర్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాంట్రకుంట గురవయ్య, అచ్చాల వెంకట రెడ్డి, అందుగుల సంతోష్, షేక్ రోషన్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం



నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గం పరిధిలోని 10వ డివిజన్‌పొన్నూరు రోడ్డు జున్ను షాహీద్ నగర్‌లో డ్రెయినేజీ సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తామని కార్పొరేటర్లు షేక్ మీరావలి, అబీద్ బాషా తెలిపారు. డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనుల్ని బుధవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నూరిఫాతిమాతో కలసి పరిశీలించారు. మరమ్మతుల కారణంగా నివాసాలు కోల్పోయిన వారికి ఇంటి స్థలాలు కేటాయించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు.

26న ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్



పాత గుంటూరు: గుంటూరు కెనల్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి వివిధ జాతుల ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు పి. రామచంద్రరాజు తెలిపారు. నగరంపాలెంలోని రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం కాంపిటీషన్, సాయంత్రం 6 గంటలకు డాగ్ ఫ్యాషన్ షో జరుగుతుందని, అనేక రకాల జాతుల కుక్కలను చూడవచ్చని తెలిపారు. ఉత్తమ పెట్ డాగ్స్‌లకు సర్టిఫికెట్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. కాంపిటీషన్‌లో పాల్గొనే వారు 9704793194, 7702153243 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

26న కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఈ నెల 26న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తూములూరి రాజేంద్రప్రసాద్, సయ్యద్ జానీ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కవులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు పీసీ సర్కార్ జయంతి సభ

పాత గుంటూరు: ప్రముఖ మెజీషియన్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ప్రపంచ మ్యాజిక్ డే నిర్వహిస్తున్నట్లు వి.వి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాజ్ సెంటర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాజిక్ ఇనిస్టిట్యూట్‌లో పీసీ సర్కార్ జయంతి సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లాలోని మెజీషియన్లు పాల్గొనాలని ఆయన కోరారు.

తేజా ఇన్‌ఫ్రా డెవలపర్ బ్రోచర్ ఆవిష్కరణ



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని ప్రముఖ సంస్థ తేజా ఇన్‌ఫ్రా డెవలపర్ కార్యాలయంలో బుధవారం తులసి మైఫియర్ పేరుతో పండరీపురం ఐదో లైనులో నిర్మిస్తున్న అపార్ట్‌మెంటు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేక ఇంటీరియర్ డిజైన్లు, ఆధునిక కిచెన్, విశాలమైన హాలు, లిఫ్ట్, విశాలమైన కారు పార్కింగ్‌తో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి వివరించారు.

నగర సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



చుట్టుగుంట పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర సమగ్రాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. అందులో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాలతో పాటు ప్రధానంగా చెన్నై, హైదరాబాద్ మహా నగరాల నుంచి గుంటూరు నగరంలోకి ప్రవేశించే చుట్టుగుంట జంక్షన్‌ను రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌లా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించినట్లు ఆయన ప్రకటించారు. చుట్టుగుంట పార్కు, జంక్షన్ నిర్మాణ పనులకు గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలతో కలసి బుధవారం అప్పిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగర ప్రత్యేకతను చాటి చెప్పేలా దాని అభివృద్ధి డిజైన్ ఉండాలని సూచించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పనుల అమలులో నగరం రాష్ట్రంలోనే బెస్ట్ అని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో జరిగిన, జరుగుతున్న కోట్లాది రూపాయల విలువైన పనులే అందుకు నిదర్శనమని తెలిపారు. ఇదే జోరును కొనసాగించడం ద్వారా రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన నగరంగా గుంటూరును తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ప్రగతిపథంలో పరుగులు పెడుతోందని చెప్పారు. నందనవనంలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చుట్టగుంట ప్రాంతం ఎంతో కీలకమైనదనీ, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ చుట్టుగుంట జంక్షన్ పనులు వేగంగా చేపట్టాలని ఆయన అధికారుల్ని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు పూర్తయిన తర్వాత గుంటూరు రూపురేఖలు సమూలంగా మారిపోతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే నగరంలో అభివృద్ధి పనులు మొదలైనట్లు చెప్పారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ చుట్టుగుంట పార్కుతో పాటు జంక్షన్‌ను ప్రజాప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా సుందర ఆకృతిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన డిజైన్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. రూపొందించిన వాటిలో బెస్ట్ మోడల్‌ని ఎంపిక చేసి పనులు ప్రారంభించడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు అడకా పద్మావతి, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, కాంట్రగుంట గురవయ్య, అందుగుల సంతోష్, మోతుకూరి వెంకటరత్నం, నగరపాలకసంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ నాగవేణి పాల్గొన్నారు.

సెబాస్టియన్‌కి ఉత్తమ నటుడు అవార్డు



కేరళ మంత్రి ఆంథోని రాజు నుంచి అవార్డు అందుకుంటున్న సెబాస్టియన్

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలు అధినేత కె.వి.సెబాస్టియన్ విద్యతో పాటు సామాజిక సేవ, కళా, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్నారు. ఇటీవల ఆయన పలు తెలుగు సినిమాల్లో నటించి, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తాజాగా మలయాళంలో ఘన విజయం సాధించిన వామనన్ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సెబాస్టియన్ మంచి నటుడిగా అక్కడి ప్రేక్షకుల ఆదరణ పొందారు. ఈ చిత్రంలో అత్యద్భుత నటనకు గాను సత్యజిత్‌రే ఫిలిం సొసైటీ నుంచి ఉత్తమ నటుడిగా అవార్డుతో సత్కరించారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆంథోని రాజు, ఫిలిం సొసైటీ చైర్మన్ సజిన్‌లాల్, ప్రముఖ దర్శకుడు హరికుమార్, హీరో భీమన్ రఘు, నటీమణి బిందు, ఫణికర్, సినీ గాయకుడు జి. వేణుగోపాల్ సమక్షంలో అవార్డు అందుకున్నారు. అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సెబాస్టియన్‌ను జ్యూరీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కేరళలో అవార్డు అందుకుని గుంటూరు వచ్చిన ఆయన్ను బుధవారం నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రగతికి సోపానంగా మేనేజ్‌మెంట్ విద్య



బహుమతులు పొందిన విద్యార్థులతో శివరామ ప్రసాద్, ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: నేడు మేనేజ్‌మెంట్ విద్య ప్రగతికి సోపానంగా నిలిచిందని ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర విభాగ డీన్ ఆర్.శివరామప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంకాం మొదటి సంవత్సర ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గడియారం సీతారామారావు భార్య సాయి ఇందిర పేరుతో స్మారక నగదు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడికతో పాటు నైపుణ్యాల్ని అభివృద్ధి పరచుకుని ఉజ్వల భవిష్యత్తుకు మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. టైం మేనేజ్‌మెంట్ సిద్ధాంతాలపై పట్టు కలిగి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. అపోలో క్లినిక్స్ జనరల్ మేనేజర్ వై. పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాల్ని మెరుగుపరచుకోవడం ద్వారా ఎంచుకున్న రంగంలో విజయాన్ని సాధించగలరని సూచించారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజమెంట్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. హెల్త్‌కేర్‌పై ఆధారపడిన బీమా, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఉపాధి అవకాశాల్ని పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఎంబీఏ, ఎంకాం ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాలలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన గిరిలక్ష్మి పూర్ణిమ విజయలక్ష్మి, రిజ్వానా (ఎంబీఏ), శ్రీవాణి, దుర్గాప్రసాద్, వైష్ణవి (ఎంకాం)కు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ప్రొఫెసర్ కె. లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కల్యాణి, సీహెచ్. వైష్ణవి, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, మణికంఠ, డాక్టర్ అశోక్‌బాబు, పద్మావతి, అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితీ సార్వభౌముడు 'నాగభైరవ'



సత్యనారాయణ, అబ్దుల్ రజా హుస్సేన్ సత్కరించిన లక్ష్మీనారాయణ తదితరులు

పాత గుంటూరు: తెలుగు సాహితీ రంగంలో దశాబ్దాల పాటు రచనా వైభవంతో వెలుగొంది, అనేక మంది శిష్యుల్ని తీర్చిదిద్దిన సాహితీ సార్వభౌముడు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై బుధవారం కవి నాగభైరవ కోటేశ్వరరావు కవితా వైభవం పేరుతో ఆయన స్మారక సాహిత్య పురస్కారాల సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డాక్టర్ నాగభైరవ రచనలు కాలాతీత కాంతి రేఖలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు డీవీయం సత్యనారాయణ, అబ్దుల్ రజా హుస్సేన్‌లకు డాక్టర్ నాగభైరవ సాహిత్య పురస్కారాల్ని అందించి సత్కరించారు. ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్టర్ రావెల సాంబశివరావు, ప్రముఖ సాహితీవేత్త గాడేపల్లి దివాకర్ దత్తు, మోదుగుల రవికృష్ణ, శేట్లం చంద్రమోహన్, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, దేవస్థానం ఉపాధ్యక్షులు లంక విజయ్ బాబు, గాంధీ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నేడు మ్యాజిక్ ద్వారా షుగర్ వ్యాధిపై అవగాహన

గుంటూరు మెడికల్: కొత్తపేటలోని పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో సీనియర్ ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి సందర్భంగా మెజీషియన్స్ డేతో పాటు మ్యాజిక్ ద్వారా షుగర్ వ్యాధిపై గురువారం ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు.

అర్థ శాస్త్రంలో కిశోర్ కుమార్‌కు పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న కారుమూరి కిశోర్‌కుమార్‌కు ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ఆయన 'ఆధార్ అనుసంధానంతో రేషన్ సరుకుల పంపిణీ–ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, ఆర్థిక అంశాలపై ప్రభావం' అనే అంశంపై కృష్ణాజిల్లా సర్వే ఆధారంగా గుంటూరుకు చెందిన ప్రొఫెసర్ అబ్బరాజు రాజశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

ప్రజలకు మెరుగైన తాగునీరు సరఫరాకు చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు మెరుగైన తాగునీరు అందించేందుకు, రానున్న వేసవిలోపే పైపులైన్ల లీకులకు మరమ్మతుల్ని పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సంజీవయ్య నగర్ రైల్వే క్రాసింగ్ గేటు, అరండల్‌పేట హెచ్‌ఎల్‌ఆర్ వద్ద జరుగుతున్న ఇంటర్ కనెక్షన్ పనుల్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్‌ఎల్‌ఆర్ ప్రస్తుతం ఉన్న 800 డయా పైప్‌లైన్ స్థానంలో ఏర్పాటు చేసిన 900 పైప్‌లైన్ అనుసంధాన పనులు యుద్ధప్రాతిపదికన జరగాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, ఆ ప్రాంతంలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనుసంధాన, లీకుల మరమ్మతుల పనులు నాణ్యతగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ అధికారులపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. లీకుల వల్ల పలు ప్రాంతాల్లో తాగునీరు వృథా అవ్వడం వల్ల శివారు ప్రాంతాలకు సమగ్రంగా ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. లీకుల్ని ప్రస్తుత షట్‌డౌన్ సమయంలోనే పూర్తి చేసేలా ఏఈలు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. రానున్న వేసవిలో నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు శాంతిరాజు, సుందరరామిరెడ్డి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, మహ్మద్ రఫిక్, ఏఈలు సేతుబాబు, సునీల్ కుమార్, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ కార్మికురాలు కర్రా మరియమ్మ కుమార్తెకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌ని బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ నుంచి పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

సేవే పరమావధిగా జీవించిన బాడెన్ పావెల్



గుంటూరు ఎడ్యుకేషన్: బాడెన్ పావెల్ స్ఫూర్తితో విద్యార్థులు సమాజ సేవకులుగా మారాలని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కె.కృష్ణప్రసాద్ సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూలులో బుధవారం ప్రపంచ స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సాహసమే శ్వాసగా, సేవే పరమావధిగా కలిసి నడచి, ప్రపంచాన్ని మారుద్దాం అనే నినాదంతో బాడెన్ పావెల్ పిలుపు ఇచ్చారని వివరించారు. ప్రిన్సిపాల్ వై. రధినీ చౌదరి మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో దేశంపై గౌరవం, బాధ్యత పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఏవో కె. వెంకట్రావు పాల్గొన్నారు.

కీళ్ల వ్యాధులకు అందుబాటులో ఆధునిక చికిత్సలు



ప్రశంసా పత్రాలతో డాక్టర్ దీపిక, డాక్టర్ ప్రత్యూష, చిత్రంలో డాక్టర్ సేవకుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: కీళ్ల నొప్పులు, వ్యాధులకు నేడు అనేక మందులు అందుబాటులోకి వచ్చాయని, బాధితులు తొలి దశలోనే వైద్యుని సంప్రదించితే నయం చేయవచ్చని రుమటాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష రాజవరపు తెలిపారు. గుంటూరు మెడికల్ అసోసియేషన్ హాలులో ఐఎంఏ నగర శాఖ ఆధ్వర్యంలో 'కీళ్ల వ్యాధులు –కారణాలు నిర్ధారణ పరీక్షలు –ఆధునిక చికిత్స విధానాలు 'అనే అంశంపై మంగళవారం రాత్రి వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ కీళ్ల వ్యాధులు ఎక్కువగా మహిళల్లో వస్తున్నాయని, సకాలంలో గుర్తించి చికిత్స చేయడం ద్వారా తీవ్రతను తగ్గించి సాధారణ జీవితం ఇవ్వొచ్చని తెలిపారు. రుమటాలజిస్ట్ పి .వి దీపిక మాట్లాడుతూ ఆటో ఇమ్యూనో కీళ్లనొప్పుల వ్యాధులు శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపుతాయని చెప్పారు. నిర్లక్ష్యం చేస్తే తర్వాత క్రమంగా గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, చర్మం వంటి ప్రధాన అవయవాలపై ప్రభావం చూపుతాయని వెల్లడించారు. కొందరికి ఉదయం కీళ్ల నొప్పులు, కొందరికి సాయంత్రం, కీళ్లు కదలికల్లో ఇబ్బందులు, కీళ్ల వాపు తీవ్రమైన నొప్పి ఉంటాయన్నారు. బాధితుల అన్ని అవయవాలను వైద్యులు పరీక్షించినప్పుడే వ్యాధుల్ని గుర్తించడం సులభం అవుతుందని తెలిపారు. అనంతరం ఇద్దరు వైద్యులకు ఐఎంఏ నేతలు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి. అమరలింగేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

- రూ. 4లక్షల విలువైన ఆభరణాలు, రూ.20 వేలు స్వాధీనం
- వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ముసుగులో నిందితులు

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బి.మఠం మండలం నందిపల్లి క్రాస్ వద్ద ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను ఈనెల 21వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గతంలో దొంగతనాలకు పాల్పడిన వివిధ కేసుల్లో రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలను, రూ. 20 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. అరెస్టయిన దొంగలలో గుంటూరు జిల్లా గోరంట్ల, అమరావతి రోడ్డులో నివాసం ఉంటున్న చిల్లర సురేష్, ఏటీ అగ్రహారానికి చెందిన పైర్ల కిరణ్‌బాబు ఉన్నారు. వీరు 2019, 2020, 2023 సంవత్సరాలలో బీ మఠం మండలంలోని గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, లింగాల దిన్నెపల్లె గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 20 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా వీరు గుంటూరులోని అట్టికా గోల్డ్ సంస్థలో 125 గ్రాముల బంగారు ఆభరణాలను విక్రయించారు. పెదనందిపాడులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో 30 గ్రాముల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టారు. ఆయా సంస్థల వారికి నోటీసులు పంపించామని ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ఇద్దరు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో సుమారు 73 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. 16 కేసుల్లో శిక్ష అనుభవించారు. ఇంకా 9 కేసుల్లో వివిధ కోర్టులలో విచారణ ఎదుర్కొంటున్నారు. మిగిలిన కేసులు కొట్టివేశారు. దొంగతనాల కేసులో వీరితో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరిలో కొందరికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

లా కాలేజీ జూనియర్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

నెహ్రూనగర్: విద్యార్థినుల్ని లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదులపై విచారణ చేసి నిజమని తేలడంతో జేసీ లా కళాశాల ఉద్యోగిని విధుల నుంచి యాజమాన్యం తొలగించిందని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని తెలిపారు. కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.అరవింద్ కుమార్‌పై వచ్చిన లైంగిక ఆరోపణలపై దిశ లాయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాలలోని ఇంటర్నల్ ఫిర్యాదు కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించామని పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థినులు రాతపూర్వకంగా ఇచ్చిన అంశాల్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో మోసపోయిన బాధితునికి నగదు అప్పగింత

నగరంపాలెం: ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్న డబ్బుల్ని రోజుల వ్యవధిలో బ్యాంక్ ఖాతాలోకి జమ చేయించడంతో బాధితుని ఆనందానికి అవధుల్లేవు. గుంటూరు సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం.. స్తంభాల గరువు షాదీఖానా రోడ్డులో నివాసం ఉండే వి.కిరణ్ ఈనెల 6న ఫేస్‌బుక్‌లో వీల్ చైర్ ప్రకటన చూసి, కొనుగోలు చేసేందుకు మొబైల్ ఫోన్ ద్వారా నిర్వాహకులతో సంప్రదించారు. ఈ క్రమంలో వారు తెలిపిన సూచనల్ని కిరణ్ అనుసరించారు. దీంతో ఆయనకు తెలియకుండానే బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1,04,000 డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. ఒక్కసారిగా డబ్బులు డ్రా కావడంతో బాధితుడు కంగారు పడ్డాడు. వెంటనే సైబర్ క్రైం ఉచిత ఫోన్ 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. కేసుని త్వరితగతిన ఛేదించేందుకు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాధితుని డబ్బులు ఓ బ్యాంక్ ఖాతాకు వెళ్లినట్లు గుర్తించారు. ఫిర్యాది డబ్బులు ఆన్‌లైన్ ద్వారా డెబిట్ చేసిన వ్యక్తితో సంప్రదించి, కూలంకషంగా వివరాలు సేకరించారు. అతడి నుంచి రూ.90 వేలను బుధవారం బాధితుడైన కిరణ్ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. దీంతో అతని ఆనందానికి అవధుల్లేవు. బుధవారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఆన్‌లైన్ ద్వారా మోసపోయిన నగదు మరలా బ్యాంక్ ఖాతాకు జమ అవుతాయని ఊహించలేదని, అయితే సైబర్ క్రైం పోలీసుల ప్రత్యేక దర్యాప్తు వల్లే సాధ్యమైందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బి.నరసింహ, ఐటీకోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌పేట 2వ లైనుకు చెందిన అనంతశక్తి శ్రీదక్ష (28)కు ఖమ్మంకు చెందిన పగడాల ఉదయ్‌కిరణ్‌తో మూడు నెలల కిందట వివాహమైంది. సంక్రాంతి పండుగకు భర్తతో కలసి గుంటూరులోని తల్లిదండ్రుల ఇంటికి శ్రీదక్ష వచ్చింది. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమె ఈ నెల 19వ తేదీ ఇంట్లో పై అంతస్తుకు వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: విద్యార్థులు చదుతోపాటుగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖరరావు తెలిపారు. బుధవారం చలపతి ఇంజినీరింగ్ కళాశాల, యలమంచిలి ఫౌండేషన్, టెక్‌వింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, విద్యార్థులు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గుంటూరు రూరల్: కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యుడు రావెల నీరెన్ తెలిపారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నరేన్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అనూరాధ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆఫీసర్ అంకప్పనాయుడు తదితరులున్నారు.

వైభవంగా ఆలయ జీర్ణోద్ధరణ ప్రతిష్ట



పాత గుంటూరు: శ్రీ లక్ష్మీనారాయణపురంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆయన జీర్ణోద్ధరణ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో త్రిదండి శ్రీ చిన జీయరుస్వామి, శ్రీ త్రిదండి అహోబల రామానుజజీయరుస్వామి, శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజజీయరుస్వామి, శ్రీమాన్ ధనకుదరం సీతా రామానుజాచార్యస్వామి పాల్గొన్నారు. ఉత్సవంలో భాగంగా అంకురారోపణం, అరణి మథనం, అగ్ని ప్రతిష్టాపనం, చతుః స్థానార్చనం, పంచగవ్యాధివాసం, ఘృతాభిషేకం, ఛాయాధివాసం, జలాధివాసం తదితర పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మహోత్సవాన్ని ఆహ్వాన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.